క్లుప్తంగా

అమ్మవారి సేవలో మాజీ గవర్నర్



ఆలయం వెలుపల మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర మాజీ గవర్నర్ నరసింహన్ కుటుంబ సభ్యులతో కలసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరు కున్న ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్ల ను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆశీర్వా ద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఎస్ఓ సతీష్, సూప రింటెండెంట్ శేషగిరి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓజోన్ పొర రక్షణ మన బాధ్యత



మాట్లాడుతున్న ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు

తిరుపతి ఎడ్యుకేషన్: ఓజోన్ పొర సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఎస్వీ జూనియ ర్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు తెలిపా రు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఆయ న మాట్లాడారు. ఓజోన్ పొర సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన కిరణాలను అడ్డుకుని భూమిని రక్షిస్తోందని తెలిపారు. అయితే మాన వ తప్పిదాలు, స్వార్థంతో ఓజోన్ పొరకు భారీ గా రంధ్రాలు పడుతోందని, తద్వారా భూవాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటూ జీవ మనుగడకు ముప్పును తీసుకొస్తోందని తెలిపారు. ఓజోన్ పొర క్షీణతతో అనేక రోగాలతో సతమతమవుతున్నారని తెలిపారు. వీలైనన్ని మొక్కలు నాటి వాతావరణ కాలుష్యా న్ని తగ్గించడం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సి.వాసుదేవులు నాయుడు, డాక్టర్ సీఎల్ చెన్నారెడ్డి, ఎస్.చంద్రి కాబాయి,విజయలక్ష్మి,విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి: ఆటోలో నుంచి కింద పడి వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన మండల పరిధిలోని తొండవాడ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మల్లయ్యపల్లికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి తిరుపతిలోని ఓ లాడ్జీలో పని చేస్తున్నాడు. సోమవారం పని ముగించుకుని తిరుపతి నుంచి షేర్ ఆటోలో చంద్రగిరికి పయనమయ్యాడు. తొండవాడ సమీపంలోని హీరా కళాశాల వద్ద వస్తున్న క్రమంలో వెనుక కూర్చున్న చంద్రశేఖర్ రెడ్డి ప్రమాదవశాత్తు జారీ కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో పాటు ముక్కు, చెవిలో నుంచి తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

శ్రీకాళహస్తి రూరల్: అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వాలని హార్టికల్చర్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత ఉద్యాన నర్సరీని, అనంతరం తొండమానుపురంలోని రైతు బత్తిరెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటని సందర్శించారు. పంట ఎలా సాగు చేస్తున్నారో రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ, నాణ్యమైన మొక్కల పెంచి రైతులకు అందుబాటులో ఉంచాలని, నర్సరీ మొక్కల పెంపకంలో తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. రైతులకు అంతర పంటల సాగుపై అవగాహన కలిప్పించాలని సూచించారు. ఇ-క్రాప్ నమోదు వంద శాతం పూర్తి చేయాలని, రైతులు ఆయిల్ పామ్ సాగుపై మొగ్గు చూపేలా అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కనీస మద్దతు ధర కలిగిన ఉద్యాన పంట ఇది ఒక్కటే అని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బి.దశరధరామిరెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్, ఉద్యాన అధికారి పుష్పలత పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం సాయంత్రం ఆటోను లారీ ఢీకొంది. బాధితుల కథనం మేరకు.. వాకాడు మండలం గొల్లపాళెంకు చెందిన కొంత మంది రైతులు ఆటోలో నాయుడుపేటకు వచ్చి వరి ధాన్యం కొనుగోలు చేశారు. బస్తాలను ఆటోలో వేసుకుని గొల్లపాళెం బయలుదేరారు. నాయుడుపేట సమీపంలోని జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఆటో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ఆటోను పక్కకు తిప్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికి ఆటో ముందు భాగం దెబ్బతిని రైతులు కృష్ణయ్య, మనెయ్య, కస్తూరయ్య, హరి, ఆటో డ్రైవర్ గురువయ్య స్వల్పంగా గాయపడ్డారు. హైవే పోలీసులు అక్కడికి చేరుకుని లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పేదలకు వైద్య విద్య దూరం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రద్దు చేయాలని తీసుకున్న నిర్ణయంతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. ఇతర రాష్ట్రాల్లో మెడికల్ కళాశాలలకు అనుమతి రాక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ అనుమతి వచ్చిన కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూడడం దారుణం. టీడీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగానే మిగులుతుంది.

- టి.హర్షిత, బైపీసీ విద్యార్థిని, సత్యవేడు



మధ్యతరగతి విద్యార్థులకు తీరని నష్టం



మెడికల్ కళాశాలను ప్రయివేట్ పరం చేయడం వల్ల మధ్య తరగతి, మెరిట్ కలిగిన పేద విద్యార్థులు నష్టపోతారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు రూ.లక్షల్లో ఫీజులు చెల్లించలేక వైద్య విద్యకు దూరం అవుతారు. కొత్త కళాశాలలు ఏర్పాటుచేస్తే సీట్లు పెరిగి పేదవారు కూడా డాక్టర్లు కావడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎంతో మంది విద్యార్థులు నష్టపోతారు.

- దేవి, బైపీసీ విద్యార్థిని, సత్యవేడు

అపసవ్య దిశలో వెటర్నరీ వర్సిటీ

రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ పశువైద్య విశ్వవిద్యాలయంగా పేరు ప్రఖ్యాతలు పొందిన తిరుపతి శ్రీవేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ అస్తవ్యస్త స్థితిలోకి వెళ్లింది. పాలన స్తంభించడంతో గత ఆరు నెలలుగా వర్సిటీలో అభివృద్ధి, పరిశోధనలపై ఎటువంటి చలనం లేదు. తాత్కాలిక అధికారులతో నెట్టుకొస్తున్న వర్సిటీలో అధికారులు తీరు ఎవరికి వారు..యమునాతీరే .. అన్న చందంగా తయారైంది. అధికారులు, అధ్యాపకుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఆశించిన పదవులు తమకు దక్కలేదని కొందరు, అర్హత ఉన్నా తమను పక్కన పెట్టారనే ఆక్రోశంతో మరికొందరు వ్యవహరిస్తున్నారు. దీంతో వర్సిటీ అపసవ్య దిశలో పయనిస్తోంది.



- పశువైద్య విశ్వవిద్యాలయంలో గాడి తప్పుతున్న పాలన
- ఎవరికివారే.. యమునా తీరే అన్న చందంగా అధికారుల తీరు
- అధ్యాపకుల లేమితో కుంటుపడుతున్న పశువైద్య విద్య
- ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకోలేని స్థితిలో వర్సిటీ
- అరకొర వేతనాలతో కార్మికుల ఆకలి కేకలు
- వర్సిటీ సమస్యలపై కన్నెత్తి చూడని ప్రభుత్వంలోని పెద్దలు

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో ఇప్పటివరకు అంతా ఇన్‌చార్జ్‌ల పాలనే కొనసాగుతోంది. అభివృద్ధిపై దృష్టి సారించే సాహసం ప్రస్తుత అధికారులు చేయడం లేదనే విషయం నిత్యం వర్సిటీలో వినిపించే మాట. దీనికి తోడు నూతన ప్రభుత్వం వర్సిటీ గురించి కనీసం పట్టించుకోకపోవడం కూడా సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అన్ని విభాగాలలోనూ అధ్యాపకుల కొరత ఉండడంతో అనుకున్న స్థాయిలో విద్యాబోధన సాగడం లేదు. అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తూ కాలయాపన చేస్తున్న అధికారుల తీరుపై ఉద్యోగులు, విద్యార్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ అనుచరులుగా ముద్రపడిన కొందరు కేసుల రూపంలో వర్సిటీ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది కొరత ఉన్నా అధికారులు నియామక ప్రక్రియను చేపట్టే సాహసం చేయలేకపోతున్నారు. పూర్తిస్థాయి అధికారుల నియామకం జరిగే వరకు వర్సిటీలో పాలన గాడిన పడదని అధికారులు అంచనాకు వచ్చేశారు. దీంతో రాష్ట్రస్థాయిలో తమ అనుకూల వర్గాలతో పైరవీలకు తెరలేపారు.

గురుపూజోత్సవానికి నోచుకోని వర్సిటీ

జిల్లాలోని అన్ని వర్సిటీల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నా కనీసం వెటర్నరీ వర్సిటీలో ఆ ఊసే లేకపోవడం దారుణం. దేశంలోనే పేరొందిన పశువైద్య విశ్వవిద్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కనీసం నివాళులర్పించని దుస్థితిలో వర్సిటీ ఉందంటే పాలన ఏమాత్రం జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. అధ్యాపకులు సైతం ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరపకపోవడంపై విస్మయానికి గురయ్యారు.

చాలీచాలని వేతనాలతో కార్మికులు..

వర్సిటీలో పనిచేస్తున్న సుమారు వందలమంది కార్మికులు, తాత్కాలిక ఉద్యోగులు అరకొర జీతాలతో కాలం వెలదీస్తున్నారు. జీతాలు సక్రమంగా రాకపోవడంతో కనీసం కడుపు నింపుకోవడం కూడా కష్టతరమైంది. అర్ధాకలితో విధులు నిర్వహిస్తూ నరకం అనుభవిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో విధులు బహిష్కరించి ఉద్యమ బాట పట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం..

పశువైద్య కళాశాలలో గత కొంతకాలంగా అధ్యాపకులు కొరత ఉన్నా అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. ప్రతి విభాగంలో కనీసం 6 నుంచి 8 మంది వరకు అధ్యాపకులు ఉండాల్సి ఉండగా కనీసం ఇద్దరు, ముగ్గురితో కాలం గడిపేస్తున్నారు. తాత్కాలిక అధ్యాపకుల నియామకాలకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరాల్సిన అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో నాణ్యమైన విద్యతో పాటు సిలబస్ సైతం సమయానికి పూర్తి కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో 45మంది మాత్రమే శాశ్వత అధ్యాపకులు ఉండగా, మరో 20 మంది తాత్కాలిక అధ్యాపకులు పని చేస్తున్నారు. అలాగే విద్యార్థినీ, విద్యార్థుల హాస్టళ్లలో వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం



వెటర్నరీ వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. అధ్యాపకుల కొరతపై ప్రభుత్వాన్ని సంప్రదించి వారి ఆదేశాల మేరకు నియమించడం జరుగుతుంది. కార్మికులకు ఫ్లడ్స్ ఎఫెక్ట్ కారణంగా జీతాలు ఆలస్యమైనా అందించాం. అమరావతిలో జరిగిన బోర్డు సమావేశంలో అన్ని అంశాలపై చర్చించాం. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా గన్నవరం వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు ఇస్తాం. వర్సిటీ పాలన వ్యవహారాలు సక్రమంగా జరుగుతున్నాయి.

- జేవీ రమణ, ఇన్‌చార్జి వీసీ, వెటర్నరీ వర్సిటీ, తిరుపతి

పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



వెటర్నరీ వర్సిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం. శ్రమకు తగిన వేతనం అందించాలి. 20 ఏళ్లుగా పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందికి గుర్తింపు కార్డులు అందించకపోవడం దారుణం. ఇచ్చే అరకొర జీతాలు సైతం ఎప్పుడో ఇస్తే కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారింది. వర్సిటీ అధికారులను ప్రభుత్వం అప్రమత్తం చేసి, వెంటనే సమస్యలను పరిష్కరించాలి.

- చిన్నబాబు, ఔట్‌సోర్సింగ్(ఆప్కాస్) రాష్ట్ర అధ్యక్షుడు, తిరుపతి

మహమ్మద్ ప్రవక్త మహనీయుడు



అన్నదానం చేస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, ముస్లిం మత పెద్దలు

తిరుపతి కల్చరల్: జగత్ ప్రవక్త హజ్రత్ మహమ్మద్ జయంతి రోజైన సోమవారం మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని దిన్-ఏ- మిలాద్ తహరిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ మహ్మద్ ఖాద్రి ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాపురం ఠాణా వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ డాక్టర్ శిరీష హాజరై ప్రసంగించారు. చెడును విడనాడి మానవులు సన్మార్గంలో నడిపించే దిశగా ధర్మ బోధనలు చేసిన మహనీయుడు ప్రవక్త అన్నారు. సర్వమానవాళికి శాంతి కలగాలని కోరిన ప్రవక్త జయంతి రోజున ముస్లింలు పేదలకు అన్నదానం చేసి సేవాభావం చాటడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ మహ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ మానవుల సంక్షేమం కోసం ధర్మ బోధనలు అందించిన ప్రవక్త సిద్ధాంతాలను ఆచరిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ శ్రేయస్సు తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పొన్నాల చంద్ర, సాకం ప్రభాకర్, సయ్యద్ తహి ఖాద్రీ, ఉస్మాన్‌ఖాద్రి, డాక్టర్ అమీముల్లాఖాద్రి, డాక్టర్ అమ్‌జాద్ అలీ బేగ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పౌరహక్కుల నేతకు ఘన నివాళులు



బొజ్జాతారకానికి నివాళులు అర్పిస్తున్న వివిధ ప్రజా సంఘాలు, సంస్థల ప్రతినిధుల

తిరుపతి కల్చరల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో పేద ప్రజల పక్షాన నిబద్ధతతో నిలిచి తన జీవితం చివరి వరకు పౌరహక్కులు కాపాడడంలో అనేక ఉద్యమాలు నడిపిన పోరాట యోధుడు, కవి, రచయిత, ప్రముఖ న్యాయకోవిదుడు బొజ్జాతారకంకు పలు సంఘాల నేతలు సోమవారం ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సోమవారం ఎంఆర్ పల్లిలోని ఆర్‌పీఐ కార్యాలయంలో బొజ్జాతారకం 8వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ సంఘాలు, సంస్థలు, పార్టీలకు చెందిన ప్రతినిధులు, పాల్గొన్నారు. ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడుతూ కారంచేడు, చుండూరు, లక్షింపేట బాధితులకు అండగా నిలిచి ఒక వైపు ప్రజా ఉద్యమాలు, మరోవైపు న్యాయపోరాటం చేయడంతో ముద్దాయిలకు శిక్షలు వేయించడంలో ప్రధాన భూమిక పోషించారని తెలిపారు. సీపీఐ నేత చిన్నం పెంచలయ్య, వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఎస్సీ, ఎస్టీ టీటీడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రావు, కవి, రచయిత గొడుగు చింత గోవిందయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిన్నం కాళయ్య, డీఎంసీ భాస్కర్, బొజ్జాతారకం కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు బాబు, నాగేంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

నోటీసులిచ్చినా ఆగని అక్రమ నిర్మాణాలు



రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసిన దుకాణాలకు నూతన షట్టర్లను ఏర్పాటు చేసిన కబ్జాదారులు

చంద్రగిరి: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చిన అధికార పార్టీ నేతలు నిర్మాణాలను ఆపడం లేదు. మల్లయ్యపల్లి సమీపంలోని చంద్రగిరి గ్రామ లెక్కల సర్వే నంబరు 1016లోని 1.03 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నేతలు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలకు పూనుకుని, దుకాణాలను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికులు రెవెన్యూ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు పలుమార్లు పనులను అడ్డుకున్నా, ప్రభు త్వ సెలవులు కావడంతో నిర్మాణాలను సాగిస్తున్నారని స్థానికులు తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినా యథేచ్ఛగా పనులను చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే.. తప్ప చర్యలు తీసుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మల్లయ్యపల్లి గ్రామస్తులు మండిపడుతున్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల హక్కుల సంఘం రాష్ట్ర నేత నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్: సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వారిని రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల హక్కుల సంఘం జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఏవీ నాగేశ్వర రావు, రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యశోదనగర్‌లో వేమన విజ్ఞానకేంద్రంలో సోమవారం రాయలసీమ జిల్లాలు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల సమగ్ర శిక్షా ఉద్యోగుల హక్కుల సాధన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. స్కూల్ కాంప్లెక్స్ రీఆర్గనైజేషన్ వ్యవహారంలో ప్రభుత్వం సమగ్రంగా చర్చించిన తర్వాత ముందుకు వెళ్లాలని సూచించారు. సీఆర్‌సీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. చిరుద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్, హెచ్‌ఆర్ పాలసీ, మినిమం టైం స్కేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్‌టైం విధానాన్ని రద్దు చేసి ఫుల్ టైమ్స్ స్కిల్ విధానాన్ని అమలు చేసి హెచ్‌ఆర్‌పీ, డీఏ అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. సామాజిక భద్రత తో పాటు పథకాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చే యాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ ప్రభు త్వం తక్షణమే సమగ్ర శిక్షా ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జ యచంద్ర, తిరుపతి జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నేతలు నాగవెంకటేష్, సూర్యకుమారి, శివ, ప్రదీప్ కుమార్, మాధవయ్య, మునికృష్ణారెడ్డి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల నేతలు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అపూర్వ చంద్ర ఐఏఎస్ హెల్త్ అండ్ వెల్ఫేర్, వినోద్ శర్మ ఐసీఎల్ఎఫ్, నార్త్ స్టేట్స్ కంపెనీస్ రిజిస్టర్ జాయింట్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శిల్పా రవిచంద్రారెడ్డి, తాడేపల్లి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు, తెలంగాణ ఎమ్మెల్యే దానం నాగేంద్ర, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, సినిమా డైరెక్టర్ రాఘవేంద్ర రావు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

బౌద్ధ సూత్రాలు ఆదర్శనీయం

తిరుపతి సిటీ: బౌద్ధ మత సూత్రాలు ఆదర్శనీయమని సమాజానికి ఎంతో దోహదపడతాయని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఇండియన్ సొసైటీ ఫర్ బుద్ధిస్ట్ స్టడీస్, కవిగురుకుల కాళిదాస, ఢిల్లీ కేంద్ర సంస్కృత వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నాగపూర్ వేదికగా సోమవారం జరిగిన బుద్ధిస్ట్ స్టడీస్ కాన్ఫరెన్స్‌ను ఆయన అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి అనే బౌద్ధ సూక్తులు ప్రతి వ్యక్తి పాటించి సామాజిక, దేశ సంరక్షణకు పాటు పడాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తిరుపతి కల్చరల్: తిరుమలలోని ఎస్వీ హైస్కూల్లో 1996–97లో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమతో కలిసి చదువుకున్న స్నేహితులను ఆప్యాయంగా పలకరిస్తూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనంద భరితులయ్యారు. ఆటపాటలతో సరదాగా గడుపుతూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా అందరూ చర్చించుకుని తిరుమల పూర్వ విద్యార్థుల పేరిట ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రతి నెలా కొంత నగదును అందులో జమ చేసుకుంటూ ఇలా కూడకట్టిన సొమ్ముతో స్నేహితుల కుటుంబాలలో ఎవరికైనా కష్టనష్టాలు వచ్చిన సమయంలో వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మికి ఘన నివాళి






ఎంఎస్ సుబ్బలక్ష్మికి నివాళులు అర్పిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు

తిరుపతి కల్చరల్: తన సంగీత మాధుర్యంతో ప్రపంచాన్నే ఓలలాడించిన సంగీత సుధామయి ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి వేడుకలు సోమవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారతరత్న, టీటీడీ పూర్వ ఆస్థాన విదుషిమణి డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి 108వ జయంతి వేడుకలను సోమవారం ఎస్వీ సంగీత, నృత్యకళాశాలలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముందుగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండు రోజుల కిందట పునఃప్రతిష్ఠించిన డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి విగ్రహానికి మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి కళాశాల ప్రిన్సిపల్ ఉమాముద్దుబాల, అధ్యాపకులు పుష్పాంజలి ఘటించి, సుబ్బులక్ష్మి గానం చేసిన కీర్తనలు ఆలపించి నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో సంగీత విభావరి, వాయిద్య సంగీత ప్రదర్శనలతో ఘనంగా ఎంఎస్ సుబ్బులక్ష్మికి సంగీత నీరాజనం సమర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగస్థలి నివాళి..

పూర్ణకుంభం సర్కిల్లో ఉన్న ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతిని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో సోమవారం కళాకారులు, ప్రతినిధులు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్ సుబ్బులక్ష్మి సంగీత గానామృతం విశిష్టతను గురించి రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం ప్రతినిధి చిత్రపుర హనుమంతరావు, రంగస్థలి కళాకారులు కె.పద్మనాభం, జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సుధాకర్, వాసు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



కచేరీతో ఎంఎస్ సుబ్బలక్ష్మికి సంగీత నీరాజనం పలుకుతున్న కళాశాల అధ్యాపకులు

భక్తిశ్రద్ధలతో గణేశ్ నిమజ్జనం



ట్రాక్టర్‌పై స్వామివారిని ఊరేగిస్తున్న యువత



తోటోత్సవంలో గ్రీసు పూసిన పోలు ఎక్కుతున్న యువత

పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లి దళితవాడలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుడుములు, చెక్కర పొంగళి, పులిహోర వంటి ప్రసాదాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పండుగలో భాగంగా నిర్వహించిన తోటోత్సవంలో గ్రామంలోని యువకులంతా ఉత్సాహంగా పాల్గొని గ్రీసు పూసిన పోలు ఎక్కి బహుమతిని సొంతం చేసుకున్నారు. అలాగే వినాయక స్వామి ముందు ఉంచిన లడ్డును వరుణ్ రూ.17,000కు వేలంలో హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు. మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో స్వామివారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. తమ ఇంటి ముందుకు వచ్చిన స్వామివారికి భక్తితో కర్పూర హారతులు పట్టారు. అలాగే గ్రామంలోని యువత రెట్టించిన ఉత్సాహంలో కోలాహలంగా రంగులు జల్లుకుంటూ స్వామివారిని ఊరేగించి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. భక్తులకు పండుగ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, యువకులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



వేలంలో పొందిన స్వామివారి లడ్డుతో బాలుడు